# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY



ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
అధ్యక్షులు ఆవుల విజయభాస్కర రెడ్డి అడ్వకేట్,B.A.L.L.B
ఆళ్లగడ్డ
9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర్ రెడ్డి శుక్రవారం 31-01-2025 సంపుటి : 06 సంచిక : 260 పేజీలు : 8 వెల : రూ 3-00


## పొలాల్లో వ్యక్తి అనుమానస్పద మృతి

కడప బద్వేల్ మండలం వెంకట శెట్టిపల్లి గ్రామ పొలాల్లో వ్యక్తి అనుమానస్పద మృతి చెందాడు. మృతుడు బీరం నరసింహారెడ్డి (55) గుర్తించారు. మృతుడి కుటుంబం మొత్తం బెంగళూరులో వ్యాపారం చేస్తున్నట్టుగా సమాచారం. భూ సర్వే జరుగుతుందని తెలిసి గ్రామానికి నరసింహారెడ్డి చేరుకున్నాడు. గ్రామ పొలాల్లోని అనుమానస్పద మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. అనుమానంతో డాగ్స్ స్క్వాడ్ తో పరిశీలిస్తునో?నారు. మృతదేహం మార్చురీకి తరలించారు. .




విజయవాడ: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల బహిరంగ లేఖ రాశారు. రేపటి నుంచి ప్రారంభం అయ్యే పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో ప్రత్యేక హోదాపై పట్టుబట్టాలని డిమాండ్ చేశారు. హోదానే రాష్ట్ర అభివృద్ధికి సంజీవని... హోదాతోనే సంపద సృష్టి అని తెలిపారు. ఏపీ అప్పుల్లో ఉందని, కొత్తగా అప్పులు పుట్టడం లేదని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి జరగాలంటే సంపద సృష్టి జరగాలని.. హోదాతోనే సంపద సృష్టి జరుగుతుందని అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల కోసం కేంద్రం వద్ద దేహి అని ప్రాధేయపడవద్దని చెప్పారు. హోదా ఉంటే కేంద్రమే 30 శాతం నిధులు రాష్ట్రానికి ఇవ్వాల్సి ఉంటుందని ఇప్పటికైనా తెలుసుకోవాలని అన్నారు. రాష్ట్రంలో పెట్టుబడుల కోసం దావోస్‌ల చుట్టూ తిరగడం కాదని.. హోదాతో రాష్ట్రానికి కంపెనీలు క్యూ కడతాయని గ్రహించాలని అన్నారు.పరిశ్రమలకు భారీగా రాయితీలు, వందశాతం ఎక్సైజ్ డ్యూటీ మినహాయింపు ఉటుందని చెప్పారు. వందశాతం ఇన్ కం టాక్స్ రాయితీలు ఉండటంలో పరిశ్రమలు రెక్కలు కట్టుకొని రాష్ట్రానికి వస్తాయని,, దీంతో లక్షల్లో ఉద్యోగాల కల్పన జరుగుతుందని చెప్పుకొచ్చారు. పన్ను రాయితీలతో అన్ని వస్తువుల ధరలు తగ్గుతాయని చెప్పారు. సగం ధరకే విద్యుత్ పంపిణీ జరుగుతుందన్నారు. ఇప్పటికే హోదా సాధించుకున్న రాష్ట్రాల్లో పరిశ్రమల అభివృద్ధి 400 రెట్లుగా ఉందని గుర్తుచేశారు. ఇన్ని లాభాలు హోదాతో సాధ్యం అవుతుంటే.. వెయ్యి కిలోమీటర్ల సముద్ర తీర ప్రాంతం కలిగిన ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేక హోదా ఉంటే.. ఎంత అభివృద్ధి అవుతుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదని అన్నారు.ప్రత్యేక హోదా ఇవ్వకుంటే మద్దతు ఉపసహరించుకోవాలని అన్నారు. కేంద్రంలో పెద్దన్న పాత్ర పోషించే అవకాశం మీకు ఉన్నప్పుడు.. రాష్ట్రానికి ప్రత్యేక హోదా అడగడానికి వచ్చిన ఇబ్బంది ఏంటని ప్రశ్నించారు. మీ మద్దతుతో అధికారం అనుభవిస్తున్న మోదీ.. రాష్ట్ర విభజన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ నెల 31 నుంచి జరుగుతున్న పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో కూటమి ఎంపీలు తమ గళం విప్పాలని అన్నారు. పదేళ్లు హోదా ఇస్తామని ఇచ్చిన మాట మీద ప్రధాని మోదీని నిలదీయాలని చెప్పారు. హోదా ఇవ్వకపోతే కేంద్రానికి ఇచ్చిన మద్దతును తక్షణం ఉపసంహరించుకోవాలని కోరారు. లేకుంటే రాష్ట్ర ప్రజల ముందు మరోసారి మిమ్మల్ని ద్రోహిగా నిలబెడతామని వైఎస్ షర్మిల హెచ్చరించారు.

## మహాకుంభమేళాలో మరోసారి భారీ అగ్నిప్రమాదం..




న్యూఢిల్లీ: మహాకుంభమేళాలో మరోసారి భారీ అగ్నిప్రమాదం జరిగింది. సెక్టార్ 22లో మంటలు చెలరేగాయి. దీంతో పెద్ద ఎత్తున మంటలు వ్యాపిస్తుండటంతో టెంట్లు తగలబడ్డాయి. వెంటనే అప్రమత్తమైన అగ్ని మాపక సిబ్బంది.. ఫైర్ ఇంజిన్లతో మంటలు అదుపుచేస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఇంతకుముందు కూడా అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటనలో పలు గుడారాలు దగ్ధమయ్యాయి.కాగా, నిన్ననే కుంభమేళాలో తొక్కిసలాట జరిగిన సంగతి తెలిసిందే. ఇంతలోనే మరోసారి అగ్ని ప్రమాదం జరగడం చర్చనీయాంశంగా మారింది. తొక్కిసలాట ఘటనలో ఇప్పటికే 30 మంది మరణించినట్లు అధికారులు తెలిపారు. మరో 60 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం వారంతా ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. అయితే, పలువురి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది.

## రూ.8440 కోట్ల బడ్జెట్ కు జిహెచ్ఎంసి కౌన్సిల్ ఆమోదం

హైదరాబాద్: జిహెచ్ఎంసి కౌన్సిల్ సమావేశం ప్రారంభంకాగానే క్వశ్చన్ అవర్ చేపట్టాలని బిఆర్ఎస్ సభ్యులు ఆందోళన చేపట్టడంతో రసభాసంగా మారింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో బడ్జెట్ పై జిహెచ్ఎంసి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. బిఆర్ఎస్ కార్పొరేటర్లు మేయర్ పోడియం చుట్టుముట్టి కాగితాలు చించి విజయలక్ష్మిపై విసిరేశారు. మేయర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న బిఆర్ఎస్ కార్పొరేటర్లను మార్షల్స్ అడ్డుకున్నారు. బిఆర్ఎస్ కార్పొరేటర్లను మేయర్ విజయలక్ష్మి సస్పెండ్ చేశారు. మేయర్ గద్వాల విజయలక్ష్మి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ నేపథ్యంలో శుక్రవారం మేయర్ గద్వాల విజయలక్ష్మి 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను పద్దు ప్రవేశపెట్టనున్నారు. రూ. 8,440 కోట్ల బడ్జెట్ కు జిహెచ్ఎంసి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. రేపు బడ్జెట్ పై చర్చలు జరుపనున్నారు.



## అమెరికాలో ఘోర విమాన ప్రమాదం



**ల్యాండ్ అయ్యే సమయంలో ఢీకొన్న హెలికాప్టర్**
**నదిలో కుప్పకూలిన విమానం, హెలికాప్టర్**
**ఎటిసి సమాచారం ఇచ్చి 30 సెకన్లలోనే ప్రమాదం**
**18మంది మృతదేహాలను వెలికి తీసిన సహాయక బృందాలు**

వాషింగ్టన్,జనవరి30: అమెరికాలోని వాషింగ్టన్‌లో ఘోర విమాన ప్రమాదం చోటుచేసుకుంది. 64 మందితో వెళ్తున్న ఓ ప్రయాణికుల విమానం.. మరో హెలికాప్టర్ పరస్పరం ఢీకొన్నాయి. ఎయిర్‌పోర్టులో ల్యాండ్ అవుతుండగా ఈ ప్రమాదం జరిగింది. దీంతో ఆ రెండూ పక్కనే ఉన్న పోటోమాక్ నదిలో కూలిపోయాయి. ఘటనాస్థలంలో అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. అమెరికా కాలమానం ప్రకారం బుధవారం రాత్రి 8.30 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది.సమాచారం అందుకున్న అధికారులు వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. గజ ఈతగాళ్లు, డైవర్ల సాయంతో నదిలో గాలిస్తున్నారు. ఇప్పటివరకు 18 మంది మృతదేహాలను వెలికితీసినట్లు తెలుస్తోంది. పీఎస్ఏ ఎయిర్‌లైన్స్ ప్రయాణికుల విమానం కాన్సాస్‌లోని విషిటా నుంచి బయల్దేరింది. వాషింగ్టన్ సమీపంలోని రోనాల్డ్ రీగన్ నేషనల్ ఎయిర్‌పోర్టు రన్‌వేపై దిగేందుకు సిద్ధమవుతుండగా.. రక్షణ శాఖకు చెందిన సికోర్‌స్కీ హెచ్-60 బ్లాక్‌హాక్ హెలికాప్టర్‌ను ఢీకొట్టింది. గగనతలంలో చోటుచేసుకున్న ఈ ప్రమాదంతో భారీ శబ్దం వినిపించింది.అమెరికన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఈ విమానాన్ని.. స్థానికంగా పీఎస్ఏ ఎయిర్‌లైన్స్ నిర్వహిస్తోంది. ఘటన సమయంలో విమానంలో 60 మంది ప్రయాణికులు, నలుగురు సిబ్బంది ఉన్నట్లు అమెరికన్ ఎయిర్‌లైన్స్ వెల్లడించింది. ఇక, హెలికాప్టర్‌లో ముగ్గురు సైనికులు ఉన్నారని, వీఐపీలు ఎవరూ లేరని రక్షణ శాఖ అధకారులు తెలిపారు. ప్రమాద సమాచారం అందుకున్న అధికారులు, రెస్క్యూ సిబ్బంది వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రయాణికుల కోసం నదిలో గాలింపు కొనసాగుతోంది. ఇప్పటివరకు ప్రాణ నష్టానికి సంబంధించిన వివరాలు తెలియరాలేదు. ఘటనపై అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ 'ఎక్స్'లో స్పందించారు. ప్రమాదం నుంచి ప్రయాణికులంతా సురక్షితంగా బయటపడాలని ప్రార్థిస్తున్నట్లుతెలిపారు.అమెరికన్ ఎయిర్‌లైన్స్ విమానంకాన్సాస్‌లోనివిచిటా నుండి బయలుదేరింది. విమానం నదిలో కూలిపోయిన తర్వాత ప్రయాణికుల కోసం శోధిస్తున్నారు. ప్రమాదానికి కారణం అస్పష్టంగా ఉంది. ప్రమాదం కారణంగా రోనాల్డ్ రీగన్ విమానాశ్రయం నుండి విమాన సేవలు నిలిపివేసారు. ఈ ప్రమాదం ఎలా జరిగిందన్న దానిపై స్పష్టమైన కారణాలు ఇంకా తెలియరాలేదు. అయితే, కేవలం 30 సెకన్లలోనే అంతా జరిగిపోయినట్లు సమాచారం .కాన్సాన్ నుంచి వచ్చిన ప్రయాణికుల విమానాన్ని ల్యాండింగ్‌కు కొన్ని నిమిషాల ముందు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్స్ సంప్రదించారు.

## బాల్యవివాహాల రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు సమిష్టి కృషి చేయండి

**జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా**




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 30 - జిల్లాలో బాల్య వివాహాల నియంత్రణకు అన్ని ప్రభుత్వ శాఖలు సమిష్టి కృషితో నియంత్రించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ సంచాలకులు వేణుగోపాల్ రెడ్డి సూచించారు. గురువారం నంద్యాల పట్టణం ఎన్జీఓస్ కాలనీలోని కోఆపరేటివ్ ఫంక్షన్ హాల్ లో బాల్యవివాహాల నియంత్రణ, కిషోర్ వికాసం, మిషన్ వాత్సల్య తదితర కార్యక్రమాలపై అన్ని శాఖలతో వర్క్ షాప్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి, యూనిసెఫ్ బాలల రక్షణ అభివృద్ధి అధికారి మురళీకృష్ణ, ఆర్డీవోలు, అన్ని శాఖల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా స్త్రీ శిశు సంక్షేమ శాఖ సంచాలకులు వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ నంద్యాల జిల్లాను బాల్యవివాహాల రహిత జిల్లాగా మార్చేందుకు స్త్రీ శిశు సంక్షేమ శాఖతో పాటు అన్ని శాఖలు సమిష్టిగా సమర్థవంతంగా కృషి చేస్తేనే సాధ్యమవుతుందన్నారు. బాల్యవివాహాలలో జరిగే అనార్థాలపై తల్లిదండ్రులకు సంపూర్ణ అవగాహన కల్పించడంతోపాటు చట్ట వ్యతిరేక చర్యల కింద రెండు సంవత్సరాల జైలు శిక్ష, లక్ష రూపాయల జరిమానా విధిస్తారన్న విషయాన్ని విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. సామాజిక కార్యక్రమం కింద బాల్యవివాహాల నియంత్రణకు అంకితభావంతో పని చేయాలన్నారు.జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ బాల్యవివాహాల నియంత్రణకు రెవెన్యూ, పోలీస్, మెడికల్ అండ్ హెల్త్ , స్త్రీ శిశు సంక్షేమం శాఖలు ప్రధాన బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఐసిడిఎస్ పిడి లీలావతి, ఆర్డీవోలు విశ్వనాథ్, నరసింహులు, నాగజ్యోతి, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, డిఆర్డిఎ పిడి శ్రీధర్ రెడ్డి, డిఈఓ జనార్దన్ రెడ్డి, డిఎంహెచ్ఓ వెంకటరమణ తదితర జిల్లా అధికారులు, అన్ని ప్రాజెక్టుల సిడిపివోలు, సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

## వాట్సప్ సేవల నెంబర్ ఇదే..

ఆంధ్రప్రదేశ్‌లో వాట్సప్ సేవలను మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. ఇక నుంచి ప్రభుత్వ ధృవపత్రాలన్నీ వాట్సప్ ద్వారానే ప్రజలకు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సందర్భంగా వాట్సప్ సేవల కోసం నెంబర్‌ను విడుదల చేశారు మంత్రి లోకేష్. వాట్సప్ గవర్నెన్స్ కోసం నెంబర్ 9552300009ను అనౌన్స్ చేశారాయన. దేశంలోనే తొలిసారి వాట్సప్ గవర్నెన్స్ ద్వారా పౌర సేవలు అందించనుంది ఏపీ సర్కార్. మొదటి విడతలో 161 సేవలను వాట్సప్ ద్వారా అందించనున్నారు. ఈ తొలి విడతలో దేవాదాయ, విద్యుత్ శాఖ, ఆర్టీసీ, రెవెన్యూ, అన్నా క్యాంటీన్, సీఎంఆర్ఎఫ్, మున్సిపల్ శాఖలలోని సేవలు అందిస్తారు. ఆ సమస్య ఉండొద్దనే..: సర్టిఫికెట్ల కోసం ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే విధానానికి స్వస్తి పలకాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. పౌరుల సమాచారం సైబర్ నేరగాళ్లకు చిక్కకుండా ఫోరెన్సిక్, సైబర్ సెక్యూరిటీ ఇవ్వాలని సీఎం ఆదేశించారు. వాట్సప్ ద్వారా పౌరసేవలు అందించేందుకు 2024 అక్టోబరు 22న మెటా సంస్థతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందం మేరకు ఇప్పుడు వాట్సప్ గవర్నెన్స్ తీసుకువస్తోంది రాష్ట్ర ప్రభుత్వం. వేగంగా పౌరసేవలు అందించటం, పారదర్శకత, జవాబుదారీతనంలో భాగంగా వాట్సప్ గవర్నెన్స్ అందుబాటులోకి తీసుకువచ్చారు. సమాచార గోప్యత, వేగంగా సేవలందించేందుకు జనరేటివ్ ఆర్టీఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా వాట్సప్ గవర్నెన్స్ పని చేస్తుంది.



# సంపాదకీయం

శుక్రవారం 31-01-2025

## అన్నీ దేశాల్లోను అక్రమ వలసలే

అమెరికా సార్వభౌమత్వాన్ని పరిరక్షించేందుకు ట్రంప్ తీవ్రంగా శ్రమిస్తున్నారు. దేశంలో చట్టవిరుద్ధంగా ఆశ్రయం పొందుతున్న తమ పౌరులను వెనక్కు పిలిపించుకునేందుకు ప్రపంచ దేశాలు తగిన చర్యలు తీసుకోవాలి' అంటూ శ్వేతసౌధం తాజాగా చేసిన ప్రకటన ఆహ్వానించదగినదే. అమెరికా కొత్త అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నంత పనీ చేశారు. అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేయగానే వలసలపై కొరడా ఝుళిపిస్తామని చేసిన ప్రకటనను నాలుగు రోజుల్లోనే అమల్లో పెట్టేశారు. దేశంలోని పలు ప్రాంతాల్లో అక్రమ వలసదారుల్ని అరెస్టులు చేయడం ప్రారంభించారు. వీరిని ప్రత్యేక ఆర్మీ విమానంలో గుర్తుతెలియని ప్రాంతానికి తరలించారు. . దీంతో మిగిలిన వారికి గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.వలసదారులపై ట్రంప్ సర్కార్ ఇవాళ కఠిన చర్యలు ప్రారంభించింది.ట్రంప్ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన మూడు రోజుల తర్వాత భారీ ఆపరేషన్ చేపట్టిన అధికారులు.. వందలాది మంది అక్రమ వలసదారులు అరెస్టు చేశారు. వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ దీనిపై స్పందించారు.అమెరికా అధికారులు 538 మంది అక్రమ వలసదారులను అరెస్టు చేశారని, సైనిక విమానాన్ని ఉపయోగించి వందల మందిని దేశం నుంచి తరలించినట్లు ప్రకటించారు. అనుమానిత ఉగ్రవాది, ట్రెన్ డి అరగువా ముఠాలోని నలుగురు సభ్యులు, మైనర్లపై లైంగిక నేరాలకు పాల్పడిన అనేక మంది అక్రమార్కులతో సహా 538 మంది అక్రమ వలస నేరస్థులను ఇవాళ అమెరికా ప్రభుత్వం అరెస్టు చేసినట్లు ప్రెస్ సెక్రటరీ వెల్లడించారు.అమెరికా చరిత్రలోనే అతిపెద్ద వలసల బహిష్కరణ ఆపరేషన్ జోరుగా సాగుతోందని ఆమె తెలిపారు.తమ దేశం సరిహద్దులను రక్షించడానికి ట్రంప్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై వైట్ హౌస్ ప్రివ్యూ విడుదల చేసినట్లు ఆమె తెలిపారు. ఇందులో అమెరికా ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అరెస్టు చేసిన కొంతమంది వ్యక్తుల పేర్లు , వారు చేసిన నేరాలను విడుదల చేశారు..ఏ దేశానికైనా అక్రమ వలసదారులు గుదిబండలా మారతారనేది నిర్వివాదాంశం. అయితే వారిని వెనక్కు పంపేందుకు విధివిధానాలంటూ ఉండాలి. లేనిపక్షంలో విమర్శలకూ, వివాదాలకూ దారితీస్తుంది. ఇప్పుడు అగ్రరాజ్యం విషయంలో జరుగుతున్నదదే. ప్రపంచంలోనే అతి గొప్ప ప్రజాస్వామిక దేశంగా చెప్పుకునే అమెరికా అక్రమ వలసదారుల విషయంలో అనుసరిస్తున్న వైఖరిని గమనించి, ప్రజాస్వామికవాదులు ముక్కున వేలేసుకుంటున్నారు. లేడికి లేచిందే పరుగన్నట్లు డొనాల్ ట్రంప్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టి వారం రోజులైందో లేదో అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపడం మొదలుపెట్టారు. తమ దేశంలో తిష్ఠ వేసుకుకూర్చున్న వేలాదిమంది విదేశీయుల్ని ఉన్నపళంగా, కట్టుబట్టలతో వెనక్కు పంపుతున్నారు.తాను అధికారంలోకి వస్తే అక్రమ వలసదారుల్ని వెనక్కి పంపుతానంటూ ట్రంప్ మొదటినుంచీ చెబుతూనే ఉన్నారు. వలస విధానాన్ని మార్చేస్తాననీ, ప్రపంచంలోనే అత్యంత భారీ డిపోర్టేషన్ చేపడతాననీ హెచ్చరించారు కూడా. ఇప్పుడు అన్నంతపనీ చేస్తున్నారు. అమెరికాను స్వర్గధామంగా భావిస్తూ, అక్కడ ఉద్యోగావకాశాలు సంపాదించి, గ్రీన్ కార్డు సాధించి, అక్కడే స్థిరపడిపోవాలనేది అనేకమంది కల. వీలైతే సక్రమ మార్గంలో, లేనిపక్షంలో అక్రమంగా ఆ దేశంలోకి చొరబడేవారు ఏటా వేల సంఖ్యలోనే ఉంటారు. అక్రమంగా వలస వచ్చినవారు పిల్లల్ని కని, వారికి అమెరికా పౌరసత్వం లభిస్తే చాలనుకుంటారు. ఇప్పుడు ఇదే ట్రంప్ ఆగ్రహానికి కారణమవుతోంది. అక్రమంగా తమ దేశంలోకి చొరబడి, తమ దేశీయుల ఉపాధి అవకాశాలను కొల్లగొట్టడమే కాకుండా, నేరాలకు ఘోరాలకు పాల్పడుతూ శాంతిభద్రతలకు పెను సవాలుగా పరిణమిస్తున్నారన్న ట్రంప్ వాదన కాదనలేని సత్యం.దేశంలోకి అక్రమంగా ప్రవేశించేవారితోపాటు దొంగతనాలకు, హింసకు పాల్పడేవారిని నిర్బంధించే బిల్లుకు అమెరికా ప్రతినిధుల సభ ఇప్పటికే ఆమోదం తెలిపిన నేపథ్యంలో ట్రంప్ తన కత్తికి పదును పెట్టారు. ఆయన ఆదేశాల మేరకు రోజుకు రెండువందల మందికి పైగా అక్రమ వలసదారుల్ని గుర్తించి, వారిని వెనక్కి పంపే బృహత్ కార్యాన్ని ఇమిగ్రేషన్ అధికారులు నెత్తికి ఎత్తుకున్నారు. కొలంబియా, మెక్సికో, బ్రెజిల్ తదితర దేశాలకు చెందిన అక్రమ వలసదారుల్ని వెనక్కు పంపిస్తున్నారు. బ్రెజిల్ వలసదారుల్ని కనీస సౌకర్యాలు సైతం లేని విమానంలో చేతులకు బేడీలు వేసి పంపిన వైనం వివాదాస్పదమైంది. ఇది మానవహక్కుల ఉల్లంఘనేనంటూ బ్రెజిల్ తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఇలాంటి ఆందోళనలను, నిరసనలను ట్రంప్ లెక్కచేయడం సరికదా, అలాంటి దేశాలను నయానో భయానో బెదిరించి మరీ దారికి తెచ్చుకుంటున్నారు. తమ దేశానికి వలసదారుల్ని తీసుకొచ్చే అమెరికా విమానాలను అంగీకరిం చబోమంటూ ప్రతిఘటించిన కొలంబియాపై భారియెత్తున సుంకాలు విధిస్తామని హెచ్చరించడం ద్వారా డోనాల్డ్ ట్రంప్ ఆ దేశం మెడలు వంచగలిగారు.అక్రమ వలసలకు అడ్డుకట్ట వేసేందుకు కంకణం కట్టుకున్న ట్రంప్, ఇందులో భాగంగా తాను అధ్యక్షుడైన తొలి రోజునే జన్మతః పౌరసత్వంపై వేటు వేశారు. పనిలోపనిగా అక్రమ వలసల బెడద ఎక్కువగా ఉన్న మెక్సికో సరిహద్దుల వద్ద జాతీయ అత్యయిక పరిస్థితిని విధించి, వలసల నిరోధానికి పదివేల మంది సైనికులను మోహరించాలని నిర్ణయిం చారు. అక్రమ వలసల పట్ల డెమోక్రాట్ల ఉదాసీన వైఖరిని ఎండగట్టడం ద్వారా ఎన్నికల్లో ఆయన ఎంతో లబ్ధి పొందారు. అంతమాత్రా న డెమోక్రాట్లు అక్రమ వలసలకు సానుకూలమని అనుకోవడానికి లేదు. దేశ వలస విధానాన్ని సంస్కరించాలని, అందుకు చట్టాల్లో మార్పు అవసరమన్నది వారి అభిప్రాయం.

# కోమటిరెడ్డి ఫ్రస్టేషన్ బుగ్గకారు కోసమేనా

నల్గొండ, జనవరి 30, (న్యూస్ పల్స్)కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి. ఆయనేం మాట్లాడినా ఆయన మాటలకు అర్థాలే వేరు అన్నట్లుగా ఉంటుంది సీన్. అధికార కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా ఉన్న రాజగోపాల్‌రెడ్డి.. ఇప్పుడు ప్రతిపక్ష పార్టీ రాగం పాడుతున్నారు. పైగా సొంత ప్రభుత్వంపై సెటైర్లు వేస్తున్నారు. కేసీఆర్ ఉన్నప్పుడే మంచిగుండే అని ప్రజలు అంటున్నారని మెచ్చుకుంటున్నారు.ప్రభుత్వ పథకాలకు పెట్టిన రూల్స్‌పై ఓపెన్‌గానే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సదరు ఎమ్మెల్యే అసమ్మతి రాగం వెనుక ఆంతర్యం ఏంటన్నదే ఇప్పుడు రాజకీయవర్గాల్లో ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. మంత్రివర్గంలో చోటు కోసం వేయి కళ్లతో ఎదురుచూస్తున్న ఈ ఎమ్మెల్యే..ఎంతకీ క్యాబినెట్ ఎక్స్‌ప్యాన్షన్ కాకపోవడంతో ఫ్రస్టేషన్‌లోనే అలా మాట్లాడి ఉంటారులే అని కాంగ్రెస్ నేతలు గుసగుసలు పెట్టుకుంటున్నారు.వ్యాఖ్యలు, ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేస్తూ పొలిటికల్ అట్రాక్షన్‌గా నిలిచే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈసారి ఏకంగా అధికారిక కార్యక్రమంలో, అందులోనూ ప్రజల సమక్షంలో బహిరంగంగానే సొంత ప్రభుత్వంపై సున్నితంగా విమర్శలు చేశారు. సంక్షేమ పథకాలు ప్రారంభించిన నేపథ్యంలో తన నియోజకవర్గంలోని చౌటుప్పల్ మండలం మసీదు గూడెంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి.తమ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క పథకానికి కూడా సరిగ్గా న్యాయం చేయలేకపోతున్నామని చెప్పుకొచ్చారు. అందుకే గ్రామాల్లో ప్రజలు తమ ప్రభుత్వాన్ని తిడుతున్నారని, కేసీఆర్ ప్రభుత్వమే బాగుండేదంటున్నారని సంచలన కామెంట్స్ చేశారు. గ్రామ సభల్లో కూడా జనాలు అధికారులను నిలదీశారని రాజగోపాల్ రెడ్డి..గుర్తు చేయడం మరింత చర్చనీయాంశమవుతోంది.రైతు బంధును 15వేలకు పెంచి ఇస్తామని..కూడా కొంత డుమ్మా కొట్టామంటూ మరో సెటైర్ వేశారు రాజగోపాల్ రెడ్డి. దానికి కారణం మాత్రం రాష్ట్ర ఆర్థిక పరిస్థితులంటూ కవరింగ్ చేసే ప్రయత్నం చేశారు. మరోవైపు ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం గురించి, వాటికి పెట్టిన రూల్స్ గురించి కూడా ఎద్దేవా చేస్తూ మాట్లాడారు.రైతు కూలీలకు 12 వేలు ఇచ్చే స్కీమ్ కు రూల్స్ ఎందుకు పెట్టారో అర్థం కావట్లేదన్నారు రాజగోపాల్ రెడ్డి. చాలా మంది తమకు రుణమాఫీ కాలేదని, రైతు బంధు రాలేదని.. ప్రభుత్వాన్ని తిడుతున్నారని చెప్పారు. రుణమాఫీ చేసిన తర్వాత కూడా కేసీఆర్ పాలనే బాగుండే అని మెచ్చుకుంటున్నారని చెప్పుకొచ్చారు.ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సొంత ప్రభుత్వ పథకాలపై సెటైర్లు వేయడం..కేసీఆర్ ప్రభుత్వాన్ని ప్రజలు మెచ్చుకుంటున్నారని చెప్పడం పొలిటికల్ హాట్ టాపిక్ అవుతోంది. కావాలనే అలా మాట్లాడారా? లేదంటే ఫ్లోలో మాట్లాడారో కానీ.. ప్రభుత్వ పథకాల పేర్లు కూడా అధికారులను అడిగి పలకటం, వివరాలు కూడా పదే పదే అడగటం, ప్రభుత్వ పెట్టిన నిబంధనలను వ్యతిరేకించటం ఆసక్తికరంగా మారింది. మంత్రి వర్గంలో చోటు కోసం ఎదురుచూస్తున్న కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి..కాంగ్రెస్ అధిష్టానం ఆ ఊసే ఎత్తకపోవడంతో ఫ్రస్టేషన్‌లో ఉండి అలా మాట్లాడుతున్నారన్న టాక్ వినిపిస్తోంది. మంత్రివర్గ విస్తరణ ఎప్పుడు అవుతుందో..అయినా తనకు స్థానం దక్కుతుందో లేదోనన్న ఆందోళనలో ఉన్నారట ఆయన. అందుకే ప్రభుత్వంపై సెటైర్లు వేస్తూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని పరోక్షంగా మెచ్చుకుంటున్నారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.కొన్ని రోజులుగా రేవంత్ రెడ్డి క్యాబినెట్‌లో బెర్త్ కోసం ఎదురుచూస్తున్న కోమటిరెట్టి రాజగోపాల్ రెడ్డి..మునుగోడులోని క్యాంపు కార్యాలయంలో వాస్తు మార్పులు కూడా చేపట్టారట. వాస్తు దోషం వల్లే తనకు రాజకీయంగా కలిసి రావడం లేదని భావిస్తున్న ఆయన..పండితుల సూచనలతో క్యాంపు ఆఫీస్‌లోని కొంత భాగాన్ని కూల్చేసి.. తన జాతకం, వాస్తు ప్రకారం మళ్లీ నిర్మిస్తున్నారని తెలుస్తోంది.ఇలా అన్ని విధాగులుగా ప్రయత్నిస్తున్నా.. మంత్రివర్గ విస్తరణ జరక్కపోవడం, జరిగినా తనకు అవకాశం వస్తుందో లేదోనన్న ఆందోళనలో ప్రతిపక్ష బీఆర్ఎస్ పాలనను మెచ్చుకుంటూ, సొంత ప్రభుత్వంపై సెటైర్లు వేస్తున్నారన్న చర్చ రాజకీయవర్గాల్లో జోరుగా సాగుతోంది.ఆ మధ్య మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని పొగడ్తలతో ముంచెత్తారు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి. ఏకంగా కాబోయే ముఖ్యమంత్రి ఉత్తమ్ అంటూ వ్యాఖ్యలు చేసి చర్చకు తెరలేపారు. అయితే మంత్రివర్గ విస్తరణ జరిగితే తనకు బెర్త్ దక్కకుండా ఉత్తమ్ అడ్డు రాకుండా ఉండాలనే వ్యూహంతోనే ఆయన అలా మాట్లాడారన్న అభిప్రాయాలు ఉన్నాయి.ఎన్నికలకు ముందు బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన రాజగోపాల్‌రెడ్డి? మంత్రి వర్గంలో బెర్త్ హామీతోనే కాంగ్రెస్ కండువా కప్పుకున్నట్లు ప్రచారం ఉంది. అయితే తొలి విడత మంత్రివర్గంలోనే రాజగోపాల్‌రెడ్డి అన్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి అవకాశం ఇచ్చారు. అన్నదమ్ములిద్దరినీ ఒకేసారి క్యాబినెట్లోకి తీసుకుంటే విమర్శలు వస్తాయని రాజగోపాల్‌ను వెయిటింగ్‌లో పెట్టినట్లు చెబుతున్నారు.మలివిడత విస్తరణలో రాజగోపాల్‌రెడ్డి కి తప్పకుండా అవకాశమిస్తామని అప్పట్లో హామీ ఇచ్చినట్లు చెబుతున్నారు. ఇప్పుడేమో మంత్రివర్గ విస్తరణ వాయిదా పడుతుండటం..పార్టీలు మారిన రాజగోపాల్ రెడ్డికి పదవి ఎలా ఇస్తారని.. ఒకే ఇంట్లో ఇద్దరికి ఎలా అవకాశం కల్పిస్తారన్న ప్రశ్నలు తలెత్తడంతోనే రాజగోపాల్‌రెడ్డి టోన్ మార్చినట్లు టాక్ వినిపిస్తోంది. అందుకే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కార్నర్ చేసేలా మాట్లాడుతున్నారన్న చర్చ జరుగుతోంది. చూడాలి మరి రాబోయే రోజుల్లో రాజగోపాల్‌రెడ్డి రాగం ఇంకా ఎన్ని రకాలుగా వినిపించబోతుందో.

# దిగాలుగా పల్లీ రైతులు

మహబూబ్ నగర్, జనవరి 30, ): తిను బండారమైన వస్తువైనా ఏదైనా తయారుచేసిన ఆ వస్తువు డిమాండ్ ను పరిగణలోకి తీసుకుంటూ ధరను నిర్ణయించడం తయారీదారుడి హక్కుగా పరిగణిస్తాం. ఇది నిజం కూడా ఇది అందరూ ఒప్పుకుంటారు. ఒక్క రైతు విషయంలో మాత్రం పండించిన పంటకు వ్యాపారస్తులు ధనం నిర్ణయిస్తారు. మార్కెట్లో తయారుచేసిన వ్యక్తికి హక్కు ఉంది.అవసరం ఉంటే కొనండి... లేదంటే మానేయండి అనే విధంగా వివిధ వ్యాపారాల్లో వ్యాపారస్తులు తమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. ఒక్క రైతు విషయానికి వస్తే మాత్రం మీరు పండించిన పంటకు ధర గింతే ? మీకు ఇష్టమైతే ఇవ్వండి లేదంటే తీసుకుపోండి ? అనే విధంగా వ్యాపారస్తులు రైతులతో వాదిస్తున్న దాఖలాలు లేకపోలేదు. నాలుగు నుంచి ఆరు మాసాలు శ్రమించి పండించిన పంట దిగుబడి అంతంత మాత్రమే ఉండి ధరలు కూడా లేకపోవడంతో వేరుశనగ రైతు కన్నీటి పర్వతమవుతున్నారు. రాత్రి పగలు శ్రమించి పండించిన వేరుశనగకు ఆశించిన మేరకు ధరలు లేకపోవడంతో రైతుల ఆవేదన అంతా ఇంతా కాదు. పల్లి కొనుగోలు చేయు సమయంలో అధిక ధరకు విక్రయించిన వ్యాపారస్తులు, రైతు విక్రయించినప్పుడు వ్యాపారస్తులు కొనే సమయంలో మాత్రం ధర ఎందుకు లేదని రైతుకు ఎప్పటికీ దొరకని సమాధానంగా ప్రశ్న మిగిలిపోతుంది. మహబూబ్ నగర్ మార్కెట్ యార్డ్ కు చాలా ప్రత్యేకత ఉంది. జిల్లా నలుమూలల నుంచి కాకుండా ఇతర జిల్లాల నుంచి అత్యధికంగా పల్లి ఈ మార్కెట్ యార్డ్ కు చేరుకుంటుంది. రోజు దాదాపు 5000 క్వింటాళ్లు పల్లి ప్రస్తుతం వస్తుంది. మంగళవారం మొత్తం 4848 పల్లి మార్కెట్ కు చేరుకుంది.అత్యధిక ధర 6526 రాగ అత్యల్పంగా దాటిన కేవలం అతి తక్కువ పనికి మాత్రమే రూ 3506 ధర రావడం జరిగింది. అత్యధికంగా పెద్ద మొత్తంలో కొనుగోలు చేయుచున్న పల్లికి రూ 3500 నుంచి రూ 5 వేల మధ్య మాత్రమే ధర పలుకుతుంది. తక్కువ స్థాయిలో మాత్రమే రూ 6600 వరకు క్వింటాల్ కు ధర పలుకుతుంది. దీంతో రైతన్న పెట్టుబడి కూడా రావడం లేదని, ఇలా అయితే ఎలా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు పంటను పండిస్తారు... వ్యాపారస్తులు ఎంత చెబితే అంతకు అమ్ముకుంటారు... ఇది మా కర్మ ఇంకా ఏం చేస్తాం అనుకుంటూ వెళ్లిపోతారు.. ఈ దృశ్యాలు, ఆవేదన శ్రమించి పండించిన పంట విక్రయించిన ప్రతిసారి రైతులు కలత చెందుతున్నారు. పల్లి కొనుగోలు చేయుసమయంలో అన్ని విత్తనాలు అందుబాటులో ఉంచిన మాదిరిగానే, పల్లి విత్తనాలు కూడా ప్రభుత్వం అందుబాటులో ఉంచి తక్కువ ధరకు నాణ్యమైన విత్తనాలు అందిస్తే మేలు జరుగుతుందని రైతులు కోరుకుంటున్నారు.ఒక పల్లె విషయానికి వస్తే మాత్రం ప్రభుత్వము పల్లి విత్తనాలను అందించడం లేదనే ఆవేదన రైతుల్లో ఎంతో ఉంది.

# హర్యానా సీఎం యమునా నీటిని తాగలేదు.. ఉమ్మేశారు: అరవింద్ కేజ్రీవాల్

న్యూఢిల్లీ: హర్యానా సీఎం నయాబ్ సింగ్ సైనీ యమునా నీటిని తాగినట్లు నటించారని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ విమర్శించారు. నోట్లోని నీటిని వెంటనే ఉమ్మేశారని ఆరోపించారు. దీనికి సంబంధించిన ఒక వీడియో క్లిప్‌ను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఢిల్లీలోకి ప్రవహించే యమునా నదిలో విష పదార్థాలను హర్యానా కలుపుతోందని అరవింద్ కేజ్రీవాల్ ఇటీవల ఆరోపించారు. హర్యానా నుంచి వచ్చే నీటిలో విషపూరిత అమోనియా ఉన్నట్లు తెలిపారు.కాగా, అరవింద్ కేజ్రీవాల్ ఆరోపణలను హర్యానా సీఎం నయాబ్ సింగ్ సైనీ ఖండించారు. బుధవారం ఢిల్లీ శివారు గ్రామంలో యమునా నదిలోని నీటిని దోసిళ్లలోకి తీసుకుని ఆయన తాగారు. అరవింద్ కేజ్రీవాల్ అబద్ధాలు చెబుతున్నారని ఆరోపించారు. ఎన్నికల నేపథ్యంలో ఢిల్లీ ప్రజలను భయందోళనకు గురి చేస్తున్నారని విమర్శించారు.మరోవైపు అరవింద్ కేజ్రీవాల్ దీనిపై గురువారం స్పందించారు. హర్యానా సీఎం నయాబ్ సింగ్ సైనీ యమునా నీటిని తాగినట్లు నటించారని విమర్శించారు. నోటిలోని నీటిని తిరిగి యమునా నదిలోకి ఉమ్మేశారని ఆరోపించారు. అమోనియా కాలుష్యం కారణంగా యమునా నీరు ఢిల్లీ ప్రజల ప్రాణాలకు ప్రమాదకరంగా మారిందన్న తనపై కేసు నమోదు చేస్తామని బెదిరిస్తున్నారని విమర్శించారు. 'తాము తాగలేని అదే విషపూరిత నీటిని ఢిల్లీ ప్రజలతో తాగించాలని వారు కోరుకుంటున్నారు. నేను ఎప్పటికీ ఇది జరుగనివ్వను' అని ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు. హర్యానా సీఎం నయాబ్ సింగ్ సైనీ యమునా నీటిని తాగి ఊసేసిన వీడియో క్లిప్‌ను అందులో పోస్ట్ చేశారు.అయితే ఎడిట్ చేసిన వీడియో క్లిప్‌ను అరవింద్ కేజ్రీవాల్ షేర్ చేశారని హర్యానా బీజేపీ ఆరోపించింది. అబద్ధాలు, మోసాల అద్దాలు తీసి ఆ వీడియోను మళ్ళీ చూడాలని సూచించింది. మీకు ధైర్యం ఉంటే ఢిల్లీ వైపు నుంచి యమునా నీటిని తాగడానికి ప్రయత్నించాలని ఎక్స్ పోస్ట్‌లో పేర్కొంది. ఎడిటెడ్, నిజమైన వీడియో అంటూ ఒక క్లిప్‌ను షేర్ చేసింది.



# మహాత్మా గాంధీ విగ్రహానికి వినతిపత్రం

నర్సంపేట జనవరి 30, ( ):కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 420 రోజులు పూర్తి అయినప్పటికి , 100 రోజుల్లో అమలు చేస్తామన్నా హామీలు అమలు చేయలేదని గురువారం బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు, నర్సంపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి ఆదేశానుసారం బి ఆర్ ఎస్ పార్టీ జిల్లా నాయకులు, మాజీ ఎంపీపీ నల్లమనోహర్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా నల్లమనోహర్ రెడ్డి మాట్లాడుతూ,రేవంత్ సర్కారుకు కనువిప్పు కలిగే విధంగా చూడాలని,అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో అన్ని హామీలు అమలు పూర్తి చేస్తామని చెప్పి నేటికీ 420 రోజులు పూర్తయిన ఇచ్చిన 420 హామీలు అమలు కాలేదని అన్నారు.గాంధీ అడుగుజాడల్లో స్వరాష్ట్రాన్ని సాధించి, గాంధీ ఆశయాలే స్ఫూర్తిగా బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో తెలంగాణను ప్రగతిపథంలో,సబ్బండ వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ఎన్నో మహత్తర కార్యక్రమాలు కేసీఆర్ చేపట్టారని వివరించాడు.అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సరిగ్గా జనవరి 30న నేటికి 420 రోజులు పూర్తిచేసుకుంటోందని,మోసపూరిత వాగ్దానాలతో ముఖ్యమంత్రి అయిన రేవంత్ రెడ్డి ప్రతినిత్యం ప్రజలను వంచిస్తూనే ఉన్నాడని విమర్శించాడు.ఎన్నికల్లో పంచిన గ్యారెంటీ కార్డుకు, ఇచ్చిన 420 హామీలకు పాతరేసి అటెన్షన్ డైవర్షన్ డ్రామాలతో కాలం వెళ్లదీస్తున్నాడని అన్నాడు.ఇప్పటికైనా హామీలన్నీ హామలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బి ఆర్ టీ యు జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, పట్టణ కార్యదర్శి వేణుముద్దల శ్రీధర్ రెడ్డి, బండి రమేష్, మాజీ కౌన్సిలర్లు ఎండి పాషా, మండల శ్రీనివాస్, దేవోజు సదానందం, నాగిశెట్టి ప్రసాద్, రామసాయం సుధాకర్ రెడ్డి, బాణాల రాంబాబు, యువజన సంఘం పట్టణ కార్యదర్శి నాయని వేణు చందు, పైసా ప్రవీణ్,ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు కొమ్ముల కరుణాకర్, బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు పుల్లూరి స్వామి, వార్డు అధ్యక్షులు బీరం నాగిరెడ్డి, రాయరాకుల సారంగం,పెండ్యాల యాదగిరి, సంపంగి సాలయ్య, మద్దెల సాంబయ్య,రచ్చ రఘు, చుక్క అనిల్,మంద ప్రసాద్,పెండెం వెంకటేశ్వర్లు,విద్యార్థి విభాగము అధ్యక్షుడు దేవోజు హేమంత్, నల్ల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్జీ-3, అడ్రియాల ఏరియాలలో అమరవీరుల దినోత్సవం

కమాన్ పూర్ జనవరి 30, అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని రామగుండం-3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాల జి.యం. కార్యాలయ ఆవరణలో గురువారం అమరవీరుల దినోత్సవం నిర్వహించారు. ముందుగా ఈ కార్యక్రమానికి హాజరైన ఉద్యోగులు, అధికారులు రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అనంతరం రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు మాట్లాడుతూ, భరతమాత విముక్తి కోసం జరిగిన స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రాణత్యాగం చేసిన ఎంతో మంది త్యాగమూర్తులు, మహానుభావులు, సమరయోధులను స్మరించుకుంటూ జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి రోజున అమరవీరుల దినోత్సవం జరుపుకుంటున్నామని అన్నారు.మనకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం ప్రసాదించడానికి వారు ఎన్నో పోరాటాలు చేశారన్నారు. కావున స్వార్థ ప్రయోజనాల కోసం ఆలోచించకుండా, ఐకమత్యంగా ఉంటూ, సమాజ హితం కోసం పాటుపడాలని కోరారు. లేదంటే మళ్లీ పూర్వపు స్థితికి వెళ్లే అవకాశం ఉ ంటుందని అన్నారు. ఈ స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలను మన భావి తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరి మీద ఉందన్నారు.ఈ కార్యక్రమంలో గుర్తింపు ప్రాతినిధ్య సంఘాల నాయకులు సంతోష్, కోట రవీందర్ రెడ్డి, ఏరియా ఇంజనీర్ వై.వి.శేఖరబాబు, వివిధ విభాగాధిపతులు చంద్రశేఖర్, రాజారెడ్డి, రాజేంద్ర కుమార్, నాగేశ్వరరావు, సుధాకర్, ఐలయ్య, గుర్రం శ్రీహరి, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# బోడుప్పల్ లో బీఆర్ఎస్ నిరసన

మేడ్చల్,మేడ్చెల్ జిల్లా బోడుప్పల్ కార్పొరేషన్ బి.ఆర్.ఎస్ అధ్యక్షులు మంద సంజీవరెడ్డి ఆధ్వర్యంలో మాజీ మంత్రి కేటీఆర్ పిలుపు మేరకు 420 అబద్దాల కాంగ్రెస్ పార్టీ హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేసిన బి. ఆర్. ఎస్. నాయకులు. ఇచ్చిన హామీలు నెరవేర్చవరకు పోరాటం చేస్తామని హెచ్చరిక. ఇంటింటికి తిరుగుతూ రేవంత్ రెడ్డి మోసాలను ఎండగడుతామని మంద సంజీవరెడ్డి అన్నారు..

# అమల్లోకి వాట్సప్ సేవలు

నెల్లూరు, జనవరి 30,ఆంధ్రప్రదేశ్ మరో కీలక సంస్కరణను అమలు చేసేందుకు సిద్ధమైంది. దేశంలో తొలిసారిగా...ప్రభుత్వ పౌరసేవలు, ప్రజల నుంచి వినతులు స్వీకరణ, అవసరమైన సమాచారం అందించేందుకు వాట్సాప్ గవర్నెన్స్ ను ప్రారంభించనుంది. జనవరి 30 నుంచి వాట్సాప్ గవర్నెన్స్ సేవలు అందుబాటులోకి వచ్చాయిజ వాట్సాప్ సేవలను మంత్రి నారా లోకేశ్ ప్రారంభించారు. తొలివిడతలో 161 ప్రభుత్వ సేవలు అందుబాటులో తీసుకురానున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. వెరిఫైడ్ ట్యాగ్ తో అధికారిక వాట్సాప్ నంబర్‌ను అందుబాటులో తెస్తామన్నారు. ఈ వాట్సాప్ నెంబర్ వన్‌స్టాప్ సెంటర్‌లా పనిచేస్తుందన్నారు. భవిష్యత్తులో ఈ సేవలను మరింత విస్తృతం చేస్తామన్నారు.ఈ విధానంలో ప్రభుత్వం నేరుగా ప్రజలకు సమాచారం అందిస్తుంది. వాట్సాప్ అకౌంట్ లో భారీవర్షాలు, వరదల కారణంగా విద్యాసంస్థలకు సెలవు ప్రకటన, విద్యుత్ అంతరాయం. పిడుగులు పడే అవకాశం, మీ ప్రాంతంలో జరిగే అభివృద్ధి పనులపై సమాచారాన్ని ఒకేసారి కోట్ల మందికి వాట్సాప్ ద్వారా చేరవేయనుంది.ప్రజలు తమ సమస్యలపై వినతులు, ఫిర్యాదులు చేయవచ్చు. ప్రభుత్వ నెంబర్ కు మెసేజ్ చేస్తే, వెంటనే వారికి ఒక లింక్ పంపిస్తారు. అందులో సంబంధిత వ్యక్తి పేరు, ఫోన్ నెంబర్, అడ్రస్, సమస్యలను టైప్ చేయాలి. వెంటనే వారికి ఒక రిఫరెన్స్ నెంబర్ ఇస్తారు. దీని ఆధారంగా వారి సమస్య పరిష్కారం ఎంత వరకూ వచ్చిందో చెక్ చేసుకోవచ్చు. తమ ప్రాంతంలోని డ్రైనేజీ కాలవల లీకేజీలు, రహదారుల గుంతలు ఫోటోలు తీసి పంపవచ్చు. వాతావరణ కాలుష్యంపై వాట్సాప్ లో ఫిర్యాదులు చేయొచ్చు. ప్రభుత్వం అమలుచేసే పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు అర్హతలు, లబ్ధి గురించి వాట్సప్ నెంబర్ కు మెసేజ్ చేసి తెలుసుకోవచ్చు.రాష్ట్రంలోని పర్యాటక ప్రదేశాల సమాచారాన్ని వాట్సాప్‌లో తెలుసుకోవచ్చు. మీకు కావాల్సిన ప్రాంతాన్ని ఎంపిక చేసుకుని, టికెట్లు, వసతి సహా అన్ని బుక్ చేసుకోవచ్చు. విద్యుత్తు బిల్లులు, ఆస్తి పన్నులను అధికారిక వాట్సాప్ ద్వారా చెల్లించవచ్చు. అలాగే ట్రేడ్ లైసెన్సులు పొందవచ్చు. దేవాలయాల్లో దర్శన టికెట్లు, వసతి బుకింగ్, విరాళాలు పంపడం చేయవచ్చు. అదే విధంగా రెవెన్యూ శాఖకు సంబంధించిన భూ రికార్డుల యాక్సెస్, వివిధ సర్టిఫికెట్లు వాట్సాప్ ద్వారా పొందవచ్చు." దేవదాయ, ఇంధనం, ఏపీఎస్ఆర్టీసీ, రెవెన్యూ, అన్న క్యాంటీన్, సీఎంఆర్ఎఫ్, మున్సిపల్ శాఖలకు సంబంధించిన 161 ప్రభుత్వ సేవలు రేపటి నుంచి వాట్సాప్ ద్వారా ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి. దేశంలోనే వాట్సాప్ ద్వారా ప్రభుత్వ సేవలు అందిస్తున్న తొలి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్.వాట్సాప్ గవర్నెన్స్ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు మంత్రి నారా లోకేష్ సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది అక్టోబర్ 22న మెటా సంస్థతో ఒప్పందం చేసుకున్నది. ధ్రువపత్రాల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే ఇబ్బంది ఇక ప్రజలకు తప్పుతుంది"- సీఎం చంద్రబాబు

# క్యాడర్ కు అండగా పార్టీ

అనంతపురం, జనవరి 30, టీడీపీ అధినేత చంద్రబాబుకు, జగన్ కు మధ్య తేడా చాలా ఉంది. చంద్రబాబుకు ఎన్నికల్లో గట్టెక్కడం ఎలాగో తెలుసు. అలాగే జనాలను ఎన్నికల సమయంలో వాగ్దానాల ద్వారా తనకు అనుకూలంగా మలచుకునేందుకు అవకాశముంది. అదే క్యాడర్ విషయంలో మాత్రం అది కుదరని పని. తమ పార్టీ అధికారంలోకి వస్తే చాలు అని భావించి అన్నింటికీ తెగించి పార్టీ కార్యకర్తలు గెలుపు కోసం కృషి చేస్తారు. పోలింగ్ కేంద్రాల వద్ద గట్టిగా నిలబడేది వాళ్లే. ఓటర్లను పోలింగ్ కేంద్రాలను తరలించేది వాళ్లే. అలాగే ప్రజలను చైతన్యవంతుల్ని చేయడంతో పాటు ప్రభుత్వంపై విమర్శలను తిప్పికొట్టడంలో క్యాడర్ ముందుంటుంది. అందుకే ఏ పార్టీ అధికారంలోకి రావాలన్నా అందుకు క్యాడర్ పాత్రను ఎవరూ కాదనలేరు. జగన్ అధికారంలో ఉన్న ఐదేళ్లు క్యాడర్ ను పట్టించుకోలేదు. పూర్తిగా సంక్షేమ పథకాలను మాత్రమే ఆయన అమలు చేయగలిగారు. అంతేకాదు వాలంటరీ వ్యవస్థను ఏర్పాటు చేయడంతో క్యాడర్ కనుమరుగై పోయింది. ప్రజలు కూడా పార్టీ క్యాడర్ ను పట్టించుకోలేదు. వారి మాటలకు గ్రామ స్థాయిలో విలువ లేకుండా పోయింది. గ్రామంలో జెండా పట్టుకుని తిరిగిన వాళ్లను జనం లెక్క చేయకపోవడం సహజంగా ఇగో దెబ్బతింటుంది. ప్రజలు పట్టించుకుంటే, నాయకత్వం తమకు బాధ్యతలు అప్పగిస్తే ఎప్పటికైనా లీడర్లుగా ఎదుగుతామని క్యాడర్ తెగించి పోరాడుతుంది. కానీ జగన్ చేసిన తప్పుతోనే మొన్నటి ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల వద్ద వైసీపీ క్యాడర్ దూరంగా ఉంది. వాలంటీర్లు ఉద్యోగులు కాబట్టి వారు సహజంగా పట్టించుకోలేదు కానీ చంద్రబాబు అధికారంలోకి రాగానే ఇప్పటి వరకూ వాలంటీర్లను అస్సలు పట్టించుకోలేదు. ఎన్నికలకు ముందు పదివేల రూపాయలు నెలకు గౌరవ వేతనం ఇస్తామని చెప్పిన చంద్రబాబు అసలు వారిని కొనసాగించే ఉద్దేశ్యంలో కూడా లేరు. ఆ వ్యవస్థ వల్ల ఉపయోగం లేదన్న భావనకు చంద్రబాబు వచ్చారు. అందించే పింఛన్లు ప్రభుత్వ ఉ ద్యోగుల ద్వారా నెల మొదటి రోజే పంపిణీ చేస్తుండటంతో వాలంటరీ వ్యవస్థ గురించి కూడా జనం పెద్దగా పట్టించుకోవడం లేదు. పైగా టీడీపీ క్యాడర్ కు గ్రామ స్థాయి నుంచి పలుకుబడి పెరిగింది. వారి వద్దకు సిఫార్సుల కోసం వచ్చే వారి సంఖ్య పెరిగింది. దీంతో పాటు కోటి మంది సభ్యత్వాన్ని చేర్పించడంలోనూ క్యాడర్ సక్సెస్ అయిందనే చెప్పాలి.ఇక చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలకు పెద్దగా ప్రాధాన్యత ఇవ్వడం లేదు. అలాగే ఉచిత ఇసుక ద్వారా క్యాడర్ లబ్దిపొందుతుంది. మద్యం దుకాణాలను కైవసం చేసుకుని ఆర్థికంగా టీడీపీ క్యాడర్ ప్రయోజనం పొందుతుంది. మరొక వైపు రహదారి మరమ్మతు పనుల విషయంలోనూ క్యాడర్ కే ప్రాధాన్యత ఇస్తున్నారు. దీనికి తోడు నామినేటెడ్ పోస్టులను భర్తీ చేస్తూ వస్తు?న్నారు. ఇలా జగన్ చేసిన తప్పులను చంద్రబాబు మాత్రం చేయడం లేదు. క్యాడర్ తనకు రక్షణ అని ఆయనకు తెలుసు. రేపటి ఎన్నికల్లోనూ గెలుపు ఆయన అనుభవం నుంచి వచ్చిందే. అందుకే జగన్ అలా అయిపోయారు.. చంద్రబాబు ఇలా వ్యవహరిస్తున్నారు.

# క్యాంపు రాజకీయాలకు వేదికగా?

## తిరుపతి నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఎన్నికలు

తిరుపతి ,తిరుపతి నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఎన్నికలు, క్యాంపు రాజకీయాలకు వేదికగా మారింది. శాసనసభ ఎన్నికల ముందు డిప్యూటీ మేయర్ పదవికి అభినయ రెడ్డి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఫిబ్రవరి మూడో తేదీన డిప్యూటీ మేయర్ ఎంపికకు షెడ్యూల్ విడుదలయింది. ఈ నేపథ్యంలో వైసీపీ కార్పోరేటర్లను క్యాంపు కు తరలించడానికి నాయకత్వం సిద్ధమయింది. ఇప్పటికే వైసిపి కార్పొరేటర్ శేఖర్ రెడ్డిని డిప్యూటీ మేయర్ అభ్యర్థిగా జిల్లా వైసీపీ అధ్యక్షుడు భూమన కరుణాకర్ రెడ్డి ప్రకటించారు. కూటమి నుంచి టిడిపి ఏకైక కార్పొరేటర్ ఆర్ సి మునికృష్ణయ్య అభ్యర్థిగా ఉండే అవకాశం వుంది.


# ఒక్కోక్కా వివాదంలో ఇరుక్కుంటున్న వైసీపీ నేతలు

కాకినాడ, జనవరి 30,అయిదేళ్ల పాలనతో అనేక అక్రమాలు, దౌర్జన్యాలకు పాల్పడిన వైసీపీలో ముఖ్య నాయకులందరూ కూటమి ప్రభుత్వానికి టార్గెట్ అవుతున్నారు. వైసీపీ మౌత్ పీస్‌లా పనిచేసి టీడీపీ, జనసేన అధినేతలతో పాటు, ఆ పార్టీల ఇష్టానుసారం నోరుపారేసుకున్న వారంతా.. ఇప్పుడు ఒకొక్క వివాదంలో ఇరుక్కుంటూ కేసులతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అయితే అలాంటి వారికి సొంత పార్టీ నుంచి ఎలాంటి మద్దతు లభించడం లేదంట. ఎవరిపై వచ్చిన ఆరోపణలకు వారే సమాధానాలు ఇస్తున్నారు తప్ప పార్టీలో ఇతర నేతలు మాత్రం వారికి సపోర్ట్‌గా మాట్లాడటం లేదట. దీంతో అసలు పార్టీలో ఏం జరుగుతుందో అర్థం కాక కేడర్ గందరగోళంలో పడుతోందంట. అసలు వైసీపీ పెద్దల మౌనం వెనుక.ప్రభుత్వం మారినప్పటి నుంచి పలువురు వైసీపీ ముఖ్య నేతలు రకరకాల ఆరోపణలు ఎదుర్కోవాల్సి వస్తూ.. కేసుల చట్రంలో ఇరుక్కుంటున్నారు. పార్టీలో కీ లీడర్ విజయసాయిరెడ్డి దగ్గరి నుంచి రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, మాజీ మంత్రులు కొడాలి నాని, పేర్ని నాని, అంబటి రాంబాబు, రోజా వంటి ముఖ్య నేతలు వివిధ అభియోగాలు ఎదుర్కొంటున్నారు. జగన్‌కు సలహాదారుడిగా వ్యవహరించిన పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, ఆయన కుమారుడు భార్గవ్‌లు కూడా అరెస్టుల భయంతో కోర్టు మెట్లు ఎక్కుతున్నారు. అయితే ఆయా నేతలపై ఆరోపణలు వచ్చిన సమయంలో ఎవరికీ వారే బయటకు వచ్చి అసలేం జరిగిందనే దానిపై వివరణలు ఇచ్చుకోవాల్సి వస్తుంది.అంతే తప్ప ఎక్కడా కూడా ఒకరికి మద్దతుగా మరొకరు మాట్లాడిన సందర్భాలు కనపడటం లేదు. ఆరోపణలు ఎదుర్కొంటున్న నేతలు మాత్రమే వివరణలు ఇచ్చుకుంటున్నారు. మామూలుగా ఏ పార్టీలో అయినా అధికారం ఉన్నా లేకపోయినా ఆరోపణలు ఎదుర్కునే నాయకులకు మద్దతుగా పలువురు నేతలు బయటకు వచ్చి మాట్లాడతారు. అధికారంలో ఉన్నప్పుడు వైసీపీలో కూడావిమర్శలను తిప్పికొట్టడానికి నాయకులంతా మీడియా ముందు ప్రత్యక్షమయ్యేవారు. కానీ ఓటమి తర్వాత వైసీపీలో అలాంటి సిట్యువేషన్ లేకపోవటం పార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.పౌరసరఫరాల శాఖ అద్దెకు తీసుకున్న పేర్ని నాని భార్య జయసుధ పేరిట ఉన్న గోడౌన్‌లో వేల బస్తాల రేషన్ బియ్యం మాయమయ్యాయి. దానిపై ప్రభుత్వం కేసు పెట్టింది. పౌరసరఫరాల అధికారుల ఫిర్యాదు మేరకు గోడౌన్ యజమాని జయసుధపై పోలీసులు లుక్ అవుట్ నోటీసులు జారీ చేయడమే కాకుండా, ఆమెను అరెస్టు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే హైకోర్టును ఆశ్రయించి ముందస్తు బెయిల్ తెచ్చుకున్నారు. ఈ కేసులో విచారణకు హాజరు కావాలని పేర్ని నాని ఆయన కుమారుడు కిట్టుకు కూడా నోటీసులు జారీ చేసేందుకు పోలీసులు ఆయన ఇంటికి వెళ్లటం.. వారు లేకపోవటంతో నోటీసులు ఇంటికి అంటించి వెళ్ళటం వంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి.అప్పట్లో నాలుగు రోజులు ఎవరికి అందుబాటులో లేని పేర్ని నాని వైసీపీ సెంట్రల్ ఆఫీస్ లో సడెన్ ఎంట్రీ ఇచ్చారు. జరిగిన పరిణామాలపై మీడియా ముందుకు వచ్చిన పేర్ని నాని.. వ్యక్తిగతంగా కక్ష తీర్చుకోవాలంటే తన సతీమణిని విడిచిపెట్టి, తనను అరెస్టు చేసుకోవచ్చన్నారు. తనను కట్టుకున్న నేరానికి నా భార్య వ్యక్తిత్వ హననానికి గురవుతుందని చెబుతూ భావోద్వేగానికి గురయ్యారు. టెక్నికల్‌గా తమ బాధ్యత లేకున్నా.. నైతికంగా బాధ్యత వహిస్తూ అధికారులు చెప్పినట్లుగా జరిమానా చెల్లించామన్నారు. తమ కుటుంబం ఎటువంటి తప్పు చేయలేదని తన తల్లి మీద ఒట్టేసి చెబుతున్నానన్నారుతమపై కక్ష కట్టి తన భార్య, గోడౌన్ ఇన్‌చార్జి మీద కేసు నమోదు చేశారన్నారు. ముందస్తు బెయిల్ కోసం హైకోర్టుకు వెళ్తే రకరకాల కుట్రలు చేశారని పేర్ని నాని ఆరోపించారు. అధికారులు అడిగినట్లు జరిమానా కట్టాక కూడా క్రిమినల్ కేసులు పెట్టడం సివిల్ సప్లైస్ చరిత్రలోనే లేదన్నారు. పేర్ని నాని వరుస పరిణాలమాలపై మీడియా సమావేశం అనంతరం కూటమి నేతలు ఆయనకు గట్టిగానే కౌంటర్ లు ఇవ్వటం స్టార్ట్ చేశారట. మంత్రులు నాదెండ్ల మనోహర్ తో పాటు కొల్లు రవీంద్ర సహా టీడీపీ నేతలు ప్రభాకర్ రెడ్డి, బుద్దా వెంకన్న తదితరులు పేర్ని నానిపై తీవ్ర విమర్శలు గుప్పించారు.గతంలోనే తమను టార్గెట్ చేసి కేసులు పెట్టించినప్పుడు ఏమైందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పేర్నినాని కేనా పెళ్లాం పిల్లలు.. తమకు లేరా అని కూటమి నేతలు ఫైర్ అయ్యారు. మంత్రిగా ఉన్నప్పుడు పేర్నినానికి ఆడవాళ్లు గుర్తుకురాలేదా అంటూ సెటైర్లు వేశారు. కూటమి నేతలు ఒకరి తర్వాత మరొకరు వరుసగా టార్గెట్ చేస్తుండటంతో పేర్ని నాని సైలెంట్ అయిపోవాల్సి వచ్చింది. అయితే కూటమి నేతలు వరుసబెట్టి నానిపై విమర్శనాస్త్రాలు సంధిస్తున్నా వైసీపీ నుంచి ఇతర నేతలు ఎవరూ ఈ విషయంలో రియాక్ట్ కాలేదు.. వైజాగ్ లో ప్రెస్ మీట్ పెట్టిన బొత్స సత్యనారాయణ హైదరాబాద్ లో ప్రెస్ మీట్లు పెట్టిన బుగ్గన, శ్రీకాంత్ రెడ్డి కానీ చిత్తూరులో మాట్లాడిన ఎంపీ మిథున్ రెడ్డి కానీ.. ఇతర సీనియర్లు కూడా వారు మాట్లాడాలనుకున్న విషయాలను మాట్లాడారే తప్ప నాని అంశాన్ని ప్రస్తావించలేదు.గతంలో విజయసాయిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, సజ్జల రామక?ష్ణారెడ్డి వంటి నేతలు ఆరోపణలు ఎదుర్కొన్న సమయంలో కూడా.. ఎవరిపై వచ్చిన ఆరోపణలకు వారే సమాధానాలు చెప్పారే తప్ప ఇతర వైసీపీ నేతలెవ్వరూ వారికి సపోర్ట్‌గా బయటకు రాలేదు.. ఆరోపణలు, విమర్శలు ఎదుర్కొంటున్న తమ నేతలకు సొంత పార్టీ వారే అండగా నిలబడకపోవడం వైసీపీ శ్రేణులకు మింగుడు పడటం లేదంట. దాని గురించి ప్రస్తావిస్తే వైసీపీ అధిష్టానం మాత్రం అవసరమైన సమయంలో అందరూ కచ్చితంగా స్పందిస్తారని చెబుతోందట.పార్టీ లీడర్ల నుంచి క్యాడర్ వరకు ఎవరికైనా ఏ ఇబ్బంది వచ్చినా వారికి పార్టీ అండగా ఉంటుందని జగన్ బయటకు వచ్చినప్పుడల్లా చెప్పి వెళ్తున్నారు. పార్టీలో ప్రతీ ఒక్కరూ ముఖ్యమేనని అందరికీ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చి పోతున్నారు .. ఆయన మాట్లాడం కాదుకదా పార్టీలో ఒకరికి మద్దతుగా మరొకరు స్పందించడం మానేశారు. దాంతో ఆరోపణలు ఎదుర్కొంటున్న నేతల విషయంలో అసలు పార్టీ లైన్ ఏంటనేది స్పష్టత రాకపోవడం పార్టీ వర్గాలను అయోమయానికి గురిచేస్తోందట. పార్టీలోని కీలక నేతలకే దిక్కులేక పోతే ఇక తమను పట్టించుకునేదెవరని? వైసీపీ శ్రేణులు బెంబేలెత్తి పోతున్నాయంట.

# తమ్ముళ్ల మధ్య తారాస్థాయికి యుద్ధం

తిరుపతి, జనవరి 30, తంబళ్లపల్లె నియోజకవర్గ పార్టీ ఇన్చార్జి జయచంద్రారెడ్డి వర్సెస్ తెలుగు తమ్ముళ్ల మధ్య యుద్ధం తారా స్థాయికి చేరింది. చంద్రబాబుపై రాళ్ల దాడి చేయడంతో పాటు యువ నేత నారా లోకేష్‌పై బూతు పురాణంతో విరుచుకుపడిన వ్యక్తులను పార్టీలోకి చేర్చుకుంటున్న ఇన్చార్జ్‌పై తంబళ్లపల్లె తమ్ముళ్లు రగిలిపోతున్నారంట. రాష్ట వ్యాప్తంగా కూటమి ప్రభంజనం వీడినప్పటికీ తంబళ్లపల్లెలో టీడీపీ ఓటమికి పెద్దిరెడ్డి కుటుంబంతో జయచంద్రారెడ్డి చేసుకున్న లోపాయికారీ ఒప్పందమే కారణమని పార్టీ శ్రేణులు విమర్శిస్తున్నాయి. అయితే పార్టీ ఇన్చార్జ్ మాత్రం తనను సొంత వారే వెన్నుపోటు పొడిచారని ఆరోపిస్తున్నారు. ఎవరి వాదనలు ఎలా ఉన్నా ప్రస్తుతం అక్కడ పార్టీకి పెద్ద దిక్కులేకుండా పోయాడంటున్నారు.చిత్తూరు జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గం టీడీపీలో వర్గ విబేధాలు తారాస్థాయికి చేరాయి. తంబళ్లపల్లె నియోజవర్గం తెలుగుదేశం ఆవిర్భావం నుంచి టీడీపీకి బలమైన నియోజకవర్గాల్లో ఒకటిగా ఉండేది. కాని ప్రస్తుతం సరైన నాయకుడు లేని పరిస్థితి ఎదుర్కొంటోంది. 2009లో లక్ష్మి దేవి కూమారుడు ప్రవీణ్ కూమార్‌రెడ్డి టీడీపీ తరపున ఎమ్మెల్యేగా ఎంపికయ్యారు. అయితే మాజీ మంత్రి అమర్‌నాథ్ రెడ్డితో పాటు ప్రవీణ్ కూడా వైసీపీలో చేరిపోయారు. 2014లో వైసీపీ తరపున పోటీచేసిన ప్రవీణ్ ను అప్పుడే టిడిపిలో చేరిన శంకర్ యాదవ్ ఓడించారుసరిగ్గా అప్పుడే మాజీ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చూపు తంబళ్లపల్లెపై కూడా పడింది. 2019లో శంకర్ యాదవ్ పై వైసిపి అభ్యర్థిగా పెద్దిరెడ్డి తమ్ముడు ద్వారకానాథ్ రెడ్డి భారీ మెజార్టీతో గెలిచారు. అ ఎన్నికల్లో ఓటమి తర్వాత తంబళ్లపల్లెలో టీడీపీ పరిస్థితి దారుణంగా మారిపోయింది. పెద్దిరెడ్డి పెత్తనానికి దడిచి జిల్లా అగ్ర నాయకులు కనీసం అటు వైపు దృష్టి సారించలేదంటారు. గత ఎన్నికల ముందు అభ్యర్థి విషయంలో చివరి దాకా అగినా.. అధిష్టానం చివరికి మాజీ ఎమ్మెల్యే శంకర్ యాదవ్ కాదని జయచంద్రారెడ్డికి టికెట్ ఇచ్చింది.జయచంద్రారెడ్డి అభ్యర్థిత్వాన్ని శంకర్ వర్గం వ్యతిరేకించింది. ఎన్నికల్లో జయచంద్రరెడ్డి రెడ్డి ఓడిపోయారు. అంతకు ముందు ఎన్నికల్లో సాధించిన మెజార్టీలో నాలుగో వంతు మెజార్టీ సాధించిన పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి రెండో సారి ఎమ్మెల్యే అయ్యారు. అప్పటి నుంచిజయచంద్రరెడ్డికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నారు శంకర్ అనుచరులకు ఇప్పుడు లోకల్ టీడీపీ కేడర్ కూడా తోడైంది.ఈ మధ్య రెండు వర్గాల మధ్య అధిపత్యపోరు పిక్స్ చేరిందంటున్నారు. ముఖ్యంగా జయచంద్రరెడ్డి తీరును అసలు తమ్ముళ్లు తట్టుకోలేక పోతున్నారంట. 2019 ఎన్నికల్లో దాదాపు 47 వేల ఆధిక్యతతో గెలిచిన పెద్దిరెడ్డి తమ్ముడు గత ఎన్నికల్లో పది వేల మెజార్టీతో గట్టెక్కారు. దానికి పెద్దిరెడ్డి ఫ్యామిలీతో జయచంద్రారెడ్డి చేసుకున్న లోపాయికారీ ఒప్పందమే కారణమన్న ఆరోపణలున్నాయి. దానికి తగ్గట్లే ఎన్నికల తరువాత పెద్దిరెడ్డి అనుచరులను ఆయన పార్టీలో చేర్చుకోవడం మొదలెట్టారు. తంబళ్లపల్లెలో చంద్రబాబుపై రాళ్ళ దాడి చేసివారికి సైతం టీడీపీలో చేర్చుకుని ప్రాధాన్యత ఇస్తున్నారని తెలుగు తమ్ముళ్లు ఆరోపిస్తున్నారు. ఆ క్రమంలో జయచంద్రరెడ్డి తీరుపై పార్టీ పెద్దలకు ఇప్పటికే పలుమార్లు ఫిర్యాదు చేశారంట. ఇన్‌చార్జ్‌గా ఆయన్ని తప్పించాలని డిమాండ్ చేస్తున్నారంట.ఇదే సమయంలో మంత్రి నారా లోకేష్ పుట్టినరోజు సందర్భంగా తంబళ్లపల్లె సెగ్మెంట్లో పోటాపోటీగా ఫ్లెక్సీలు వెలిశాయి. జయచంద్రారెడ్డి వర్గం ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను అయన వ్యతిరేకవర్గం చింపేయడంతో.. శంకర్ వర్గం తెచ్చిన భారీ కేక్ ను నేల పాలు చేసారు జయచంద్రారెడ్డి వర్గీయులు. ఇరు వర్గాలు రోడ్డున పడి కొట్టుకునే స్థితికి రాగా వారిని సముదాయించడం పోలీసులకు తలనొప్పిగా మారింది. ఎన్నికల ముందు శంకర్‌యాదవ్ అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించిన స్థానిక కేడర్ ఇప్పుడు జయచంద్రారెడ్డి తీరు నచ్చక శంకర్‌తో కలసి అడుగువేస్తున్నారంట.జయచంద్ర రెడ్డి మాత్రం ఎవరు ఎన్ని చెప్పినా వినకుండా వైసీపీ మద్దతుదారులకే సహాయం చేస్తున్నారని ఆరోపణలు తీవ్ర స్థాయిలో వినబడుతున్నాయి. ఎన్నికల ముందు పెద్దిరెడ్డితో లోపాయికారీ ఒప్పందం గురించి ఆరోపణలు ఎదుర్కొన్న జయచంద్రారెడ్డి ఎన్నికల తర్వాత కూడా అదే తీరు ప్రదర్శిస్తుండటంపై తెలుగుతమ్ముళ్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో అక్రమ కార్యకలాపాలు పెరిగాయని దానికి కారణం జయ చంద్రారెడ్డి వెంట తిరుగుతున్న వైసీపీ మద్దతు దారులే అన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. చంద్రబాబు పై అంగల్లలో రాళ్లతో దాడి చేసిన వారికి సైతం ఆయన రక్షణగా ఉంటూ పచ్చ కండువా కప్పి తన వెంట తిప్పుకుంటున్నారంట. మొత్తం మీద టిడిపిలోని గొడవలను వైసీపీ శ్రేణులు తెగ ఎంజాయ్ చేస్తున్నాయంట.

# ఢిల్లీ ప్రచారానికి చంద్రబాబు, పవన్



విజయవాడ జనవరి 30,భారతీయ జనతా పార్టీ.. పలు రాష్ట్రాల్లో అవలంభించిన గెలుపు ఫార్ములాను ఢిల్లీ గల్లీలో అమలు చేయబోతోంది. ఏపీ సెంటిమెంట్‌తో ఢిల్లీలో కూడా తిరుగులేని విక్టరీ కొట్టాలని భావిస్తోంది బీజేపీ అధిష్ఠానం.. సార్వత్రిక ఎన్నికల ప్రభంజనం తర్వాత మహారాష్ట్రలో మహాయుతి కూటమి ఘన విజయం సాధించింది. 132 స్థానాల్లో గెలిచి బీజేపీ అతిపెద్ద పార్టీగా అవతరించింది. ఈ ఫలితాలు మోదీకి ఎంతో శక్తినిచ్చాయి. విడిపోతే అంతర్థానమైపోతాం.. ఒక్కటిగా ఉంటే సురక్షితంగా ఉంటాం అనే నినాదాలతో పాటు బంగ్లాదేశ్ చొరబాటుదారుల సమస్యను బలంగా లేవనెత్తారు. వీటితో పాటు ఏపీలో కూటమి నేతల ప్రచారం బాగా కలిసొచ్చింది. ఇలా అన్నీ కలిసి మహాయుతి కూటమికి తిరుగులేని విజయాన్నందించాయి. ఎన్డీఏ సంఖ్యా బలంలో కీలకంగా టీడీపీ, జనసేన.. వేర్వేరు రాష్ట్రాల్లో ఎన్డీఏ గెలుపు కోసం తమవంతు పాత్రను పోషిస్తున్నాయి. మరఠ్వాడా, విదర్భ, పశ్చిమ మహారాష్ట్ర ప్రాంతాల్లో జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో బీజేపీ అధిష్ఠానం ప్రచారం చేయించింది. మొత్తం ఐదు బహిరంగ సభలు.. రెండు రోడ్ షోలకి ప్లాన్ చేసింది. తెలుగువాళ్లు ఎక్కువగా ఉండే ఈ ప్రాంతాల్లో పవన్‌తో ప్రచారం చేయించి ఓట్లను రాబట్టుకోవడంలో సక్సెస్ అయింది. సీఎం చంద్రబాబు ప్రచారానికి వెళ్లాల్సి ఉన్నా ఆఖరి నిమిషంలో మహారాష్ట్ర పర్యటన రద్దు రద్దయింది.ఏపీలో కూటమి నేతలు మహారాష్ట్రలో ప్రచారానికి వెళ్లడం.. అక్కడ విజయం సాధించడాన్ని బీజేపీ సెంటిమెంట్‌గా భావిస్తోంది. ఇప్పుడదే సెంటిమెంట్‌ను ఢిల్లీలోనూ ప్రయోగించాలనుకుంటోంది. హస్తినలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ అధికార, విపక్ష పార్టీలు ఎన్నికల ప్రచారంలో మునిగిపోయాయి. ఓటర్లను ఆకట్టుకునేందుకు హామీల వర్షం కురిపిస్తున్నాయి. ఈ క్రమంలో బీజేపీ కీలక నిర్ణయం తీసుకుంది. ఏపీ సీఎం చంద్రబాబును ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో దింపబోతుంది. ఫిబ్రవరి 1న ఢిల్లీలో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు చంద్రబాబు. తెలుగువాళ్లు నివసించే ప్రాంతాల్లో బీజేపీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేయబోతున్నారు. అలాగే పవన్ కల్యాణ్ కూడా ప్రచారంలో పాల్గొంటారని తెలుస్తోంది. బహిరంగ సభలు, రోడ్ షోలు ఎక్కడెక్కడ ఎలా ఉండాలన్న దానిపై త్వరలో క్లారిటీ రానుంది. కూటమి నేతల ప్రచారం మహారాష్ట్రలో వర్కవుట్ అయినట్టే ఢిల్లీలోనూ కలిసొస్తుందని బీజేపీ అధిష్ఠానం లెక్కలేసుకుంటోంది.

# ప్రకాశంజిల్లాల్లో ఎయిర్ పోర్టు అడుగులు

ఒంగోలు, జనవరి 30,ప్రకాశం జిల్లాలో ఎయిర్‌పోర్టు కల సాకారమయ్యే టైమ్ వచ్చేసింది. కూటమి సర్కార్ చొరవతో ఒంగోలు ఎయిర్‌పోర్టు స్వప్నం సాకారం కాబోతుంది. సియం చంద్రబాబు నాయుడు చొరవతో ఏపీలో కొత్తగా ఏడు ఎయిర్‌పోర్టుల ఏర్పాటుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఒంగోలు సహా ఏపీలో 7 కొత్త ఏయిర్‌పోర్టుల నిర్మాణాలు చేపట్టనున్నట్టు ప్రకటించారు కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు. ఒంగోలుకు సమీపంలోని అల్లూరు ? ఆలూరు మధ్యలో ఏయిర్ పోర్టు ఏర్పాటుకు అనుకూల భూములున్నాయని రెవెన్యూ అధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపించారు.. గతంలో వాన్‌పిక్ కోసం సేకరించిన భూముల్లో 732 ఎకరాలను కేటాయించే దిశగా ప్రణాళికలు సిద్ధం పట్టాలెక్కాయి.ఎయిర్‌పోర్ట్ అధారిటీ నుంచి అధికారుల బృందం ఒంగోలు పరిసర ప్రాంతాల్లో పర్యటించింది. ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, నగర మేయర్ గంగాడ సుజాత, ఇతర జిల్లా అధికారులు బృందం సభ్యులతో కలిసి ఒంగోలు సమీపంలోని కొప్పోలు, అల్లూరు, ఆలూరు మధ్య ఉన్న వాన్‌పిక్ స్థలాలను పరిశీలించారు. ఇప్పటికే వాన్‌పిక్ ఆధీనంలో ఉన్న 600 ఎకరాలతో పాటు మరో 150 ఎకరాలు రైతుల నుంచి సేకరించాల్సి ఉంది. ఈ భూములు ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి అనువుగా ఉన్నాయా.. నుంచి వివరాలు సేకరించారు. ప్రతిపాదిత స్థలం లేఅవుట్లను పరిశీలించారు. కూటమి సర్కార్ చొరవ వల్లే ఎన్నో ఏళ్ల తమ కల సాకారం అవుతుందని హర్షం వ్యక్తం చేశారు స్థానికులు. భూముల ధరలు పెరగడంతో పాటు స్థానికంగ విద్యా, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయంటున్నారు. ఒంగోలు సమీపంలో ఎయిర్‌పోర్ట్ నిర్మాణం వల్ల ప్రకాశం జిల్లా పారిశ్రా మికంగా అభివృద్ధి చెందుతోంది. తూర్పు ప్రకాశంలో ఇంతవరకు ఎలాంటి పెద్దపరిశ్రమలు లేకపోవడంతో కోస్తాతీరం అభివృద్ధి చెందలేదు. రానున్న రోజుల్లో ఒంగోలుసమీపంలో విమానాశ్రయం, కొత్తపట్నం దగ్గర పోర్టు నిర్మిస్తే తూర్పు ప్రకాశం అభివృద్ధిలో అగ్రభాగం లోఉండే అవకాశాలున్నాయి. ఈ పరిస్థితుల్లో కేంద్ర విమానయానసంస్థ అధికారులు ఒంగోలులో పర్యటించిన నేప థ్యంలో జిల్లా ప్రజల్లో విమానాశ్రయం ఆశలు చిగురిస్తున్నాయి? విమానాశ్రయం ఏర్పాటుకు ఎపిఎడిసికి 1.92 కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయడంతో జిల్లా ప్రజల్లోపూర్తిస్థాయి నమ్మకం ఏర్పడింది. ప్రతిపాదనలు పట్టాలెక్కాయి.

## మహాత్మాగాంధీ దేశానికి చేసిన సేవలు మరువ లేనివి




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 30 – గాంధీజీ దేశానికి చేసిన సేవలు మరువ లేనివి అని మున్సిపల్ ఛైర్ పర్సన్ మాబున్నిసా. కమిషనర్ నిరంజన్ రెడ్డి. ఎమ్ ఈ గురప్పయాదవ్ పేర్కొన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయం లో ఛైర్ పర్సన్ మాబున్నిసా. ఎమ్ ఈ గురప్పయాదవ్. టౌన్ ప్లానింగ్ అధికారి నరసింహ మూర్తి. డీఈలు. మున్సిపల్ సిబ్బంది తదితరులు గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే గాంధీచౌక్ వద్ద గాంధీ విగ్రహానికి కమిషనర్ నిరంజన్ రెడ్డి మున్సిపల్ సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ గాంధీజీ వర్ధంతి ప్రతి సంవత్సరం జనవరి 30వ తేదీన జరుగుతుందన్నారు . జాతి పితగా పేరు పొందిన మహాత్మా గాంధీ దేశానికి చేసిన సేవను ఆయన జీవిత విశేషాలను గురించి వివరించారు. గాంధీజీ 1948 జనవరి 30వ తేదీన న్యూఢిల్లీలోని బిర్లా హౌస్ లో 78 సంవత్సరాల వయసులో మరణించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది సచివాలయ సిబ్బంది ఉన్నారు.

## దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన మహోన్నత వ్యక్తి గాంధీజీ




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 30 – నంద్యాల గాంధీజీ చూపించిన బాటలో నేడు ప్రపంచమంతా నడుస్తుండడం భారతీయులుగా మనకు గర్వకారణం అని నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ అన్నారు. ఈ సందర్భంగా స్థానిక గాంధీ చౌక్ నందుగల గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు సుధాకర్ , రవి , తెలుగుదేశం పార్టీ నాయకులు వైయస్ ఆర్ నగర్ టిడిపి పార్టీ ఇన్ చార్జ్ దేరెడ్డి శివనాగిరెడ్డి కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

### మహాత్మా గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన ఆర్యవైశ్య సంఘ సభ్యులు..

విభారే న్యూస్ జనవరి 30 ఎమ్మిగనూరు.జాతీయ పిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆ మహానీయులు విగ్రహానికి పూలమాలలు సమర్పించి, నివాళులు అర్పించడం జరిగినది.రేపు మాఘమాస శుద్ధ విదియ అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం మన ఇలవేలుపు ఆరాధ్య దేవత శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మాతకు ప్రభుత్వ లాంఛనంగా పట్టు వస్త్రాలు సమర్పించే కార్యక్రమాన్ని అధికారికంగా 181 జీవో నెం. ను ప్రకటించడం జరిగినది. ఆర్యవైశ్యులను గౌరవించి,సహృదయంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబునాయుడు కి ఎమ్మిగనూరు ఆర్యవైశ్య సంఘం తరఫునప్రత్యేక ధన్యవాదాలుతెలుపుతున్నాము.ఈ కార్యక్రమం లో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు తక్కశిల సుబ్రహ్మణ్యం , కార్యవర్గ సభ్యులు సంఘ సభ్యులు పాల్గొనడం జరిగినది.



# అంధులకు నూతన వస్త్రాల పంపిణీ

### గాంధీజీ, లూయీ బ్రెయిలీ లకు ఘన నివాళి.

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 30 – నంద్యాల దివ్యాంగుల సంక్షేమ సంఘం, కంటి చూపు దివ్యాంగ ఉద్యోగుల సంఘం, ఐఎంఏ నంద్యాల, నంద్యాల లయన్స్ క్లబ్ సంయుక్త నిర్వహణలో గురువారం స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో గాంధీ వర్ధంతి, లూయీ బ్రెయిలీ జయంతి ఉత్సవాలలో భాగంగా అంధులకు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.నంద్యాల దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రామకృష్ణ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ జి.రామకృష్ణారెడ్డి, నంద్యాల ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ మధుసూదనరావు, లయన్స్ క్లబ్ అధ్యక్షులు నిజాముద్దీన్,ఐఎంఏ రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి డాక్టర్ లక్ష్మి సౌజన్య,కంటి చూపు దివ్యాంగుల ఉద్యోగ సంఘం ప్రధాన కార్యదర్శి ఓబులేసు పాల్గొని ప్రసంగించారు. ముందుగా గాంధీజీ,లూయీ బ్రెయిలీ చిత్రపటాలకు పూలమాలలతో నివాళులర్పించి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. కంటి చూపు దివ్యాంగులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. దివ్యాంగులకు సహకరిస్తున్న డాక్టర్ లక్ష్మి సౌజన్య, లయన్స్ క్లబ్ సభ్యులు రవి ప్రకాష్, రామన్న, వెంకటేశ్వర్లను దివ్యాంగుల సంక్షేమ సంఘం తరపున సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ



సందర్భంగా డాక్టర్ రామకృష్ణారెడ్డి,డాక్టర్ రవి కృష్ణ, డాక్టర్ మధుసూదనరావు మాట్లాడుతూ అంధత్వం అధికమించి అభివృద్ధి పథం లో నడవాలని పిలుపునిచ్చారు. కృత్రిమ మేధ సహకారంతో నూతన కంటి అద్దాలు ఇటీవల హైదరాబాదులో ఆవిష్కరించారని, వాటి సహకారంతో కంటి చూపు లేని వారు అనేక ప్రయోజనాలు పొందడానికి ఆస్కారం ఏర్పడుతుందని, వాటిని నిరుపేద అంధ కళాశాల విద్యార్థులకు ఐఎంఏ ,లయన్స్ క్లబ్ తరపున అందజేస్తామని అన్నారు. దివ్యాంగుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కంటి చూపు దివ్యాంగుల ఉద్యోగ సంఘం ప్రధాన కార్యదర్శి ఓబులేసు, స్పందన అంధుల సంక్షేమ సంఘం అధ్యక్షులు చంద్రశేఖర్ మాట్లాడుతూ ఉద్యోగాలు సాధించిన దివ్యాంగులు నిరుద్యోగ దివ్యాంగులకు సహకారం అందించాల్సిన అవసరం



ఉందని అన్నారు. దివ్యాంగులు చదువులో, క్రీడలలో రాణించి ఉద్యోగాలు సాధించి జీవితంలో పైకి ఎదగడానికి కృషి చేయాలని అన్నారు. ఐఎంఏ మిషన్ పింక్ హెల్త్ నంద్యాల, జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా బాలికలకు నిర్వహించిన జిల్లా స్థాయి వక్తృత్వ పోటీ విజేతలకు బహుమతులు అందజేశారు. ఐఎంఏ తరపున భోజన వసతి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ నంద్యాల అధ్యక్షులు డాక్టర్ మధుసూదనరావు, ఐఎంఏ రాష్ట్ర మహిళా విభాగ కార్యదర్శి డాక్టర్ లక్ష్మి సౌజన్య, ఐఎంఏ నంద్యాల మిషన్ పింక్ హెల్త్ అధ్యక్షురాలు డాక్టర్ అరుణకుమారి,లయన్స్ క్లబ్ అధ్యక్షులు నిజాముద్దీన్, కార్యదర్శి శిరిగిరి రమేష్, నంద్యాల జిల్లా పారా స్పోర్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.పి.వి. రమణయ్య, స్పందన అంధుల సంక్షేమ సంఘం అధ్యక్షులు చంద్రశేఖర్,సీనియర్ లయన్స్ క్లబ్ సభ్యులు రవి ప్రకాష్, రామన్న, వెంకటేశ్వర్లు, కంటి చూపు దివ్యాంగుల యువజన విభాగం అధ్యక్షులు లింగస్వామి, కంటి చూపు దివ్యాంగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పశు సంపద ఆవాసాలకు స్థలాలను అన్వేషించండి

### జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా


విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 30 – జంతువుల ఆశ్రయ నివాసాలకు స్థలాలను అన్వేషించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి కమిటీ సభ్యులను, సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన జంతువుల పట్ల క్రూరత్వానికి నిరోధించు సొసైటీ సభ్యులతో సమావేశం జరిగింది. జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డా. బి. గోవింద నాయక్, ఇతర అధికారిక సభ్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో ఉన్న పశుసంపద ఆశ్రయ నిమిత్తం సలాలను గుర్తించాలని కమిటీ సభ్యులను, సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఉన్న వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ లు చేయించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పశువుల సంతల




వివరాలు అడిగి తెలుసుకుంటూ జిల్లాలో పశు సంపద అక్రమ రవాణాపై నిఘా పెట్టాలన్నారు. పశు సంపద పరిరక్షణపై కమిటీ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అన్ని మున్సిపాలిటీలో రోడ్లపై తిరిగే పశువుల నియంత్రణకు మున్సిపల్ కమిషనర్ లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇటీవల బనగానపల్లె పట్టణంలో వీధి పశువులను చేపట్టిన అంశాలను కలెక్టర్ వివరించారు.

## శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం, దాతలకు శ్వాశతంగా గుర్తింపు

### అహోబిలం మఠం జనరల్ మేనేజర్ వి. మురళీధరన్



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 30 – అహోబిలం దేవస్థానానికి సంవత్సరం పొడవునా కూరగాయలు వితరణ చేస్తూ విరాళంగా అందిస్తూ, ఆలయ నిత్య పూజలు మరియు అన్నదాన కార్యక్రమాల నిరంతర కొనసాగింపునకు మేలు చేస్తున్న మార్కెట్ ప్రసాద్ కు దేవస్థానం తరపున శ్వాశతంగా గుర్తింపు లభించిందని శ్రీ లక్ష్మి నృసింహ స్వామి దేవస్థానం జనరల్ మేనేజర్ వి. మురళీధరన్ పేర్కొన్నారు .అలాగే, దిలీప్ కుమార్ మరియు చంద్ర ఒబుల్ రెడ్డి అహోబిళం ఎగువ మరియు దిగువ వంటశాల, అన్నదానానికి పెరుగు మరియు పాలు విరాళంగా అందిస్తూ ఎనలేని సేవ చేస్తున్నారు. వారి ఈ విశిష్టమైన సేవ భక్తులకు పవిత్ర ప్రసాదాన్ని అందించేందుకు, అలాగే స్వామివారికి నైవేద్యాన్ని సమర్పించేందుకు ఎంతో ఉపయోగ పడుతుందన్నారు .ఈ మహోన్నత సేవ చేస్తున్న వీరికి శ్రీ లక్ష్మి నరసింహ స్వామివారి అనుగ్రహం ఎల్లప్పుడూ కలగాలని మనసారా కోరుకుంటున్నామని తెలిపారు

## హరిహర క్షేత్రంలో ధ్వజారోహణతో బ్రహ్మోత్సవాలను ప్రారంభించిన మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్




కర్నూలు, జనవరి 30 స్థానిక సంకల్బాగ్ నందు ఉన్న హరిహర క్షేత్రంలో శ్రీ భూదేవి, శ్రీదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి 19వ వార్షిక బ్రహ్మోత్సవాలను మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ ధ్వజారోహణ గురువారం చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేష్ మాట్లాడుతూ 30 సంవత్సరాల క్రితం బ్రాహ్మణ సంఘ ఆధ్వర్యంలో ఈ ఆలయాన్ని నిర్మించినట్టు తెలిపారు. అప్పటి నుంచి కూడా ఎంతో నియమ, నిష్ఠలతో తిరుమల తిరుపతి దేవస్థానంలో జరిగిన విధంగా పూజలు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. పవిత్ర తుంగభద్రా నది తీరాన వెలసిన ఈ క్షేత్రంలో తిరుమలలో జరిగే విధంగా బ్రహ్మోత్సవాలు నిర్వహించాలని తలపెట్టి గత 19 సంవత్సరాలుగా బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నట్లు టీజీ తెలిపారు. కర్నూలు ప్రజల పుణ్యఫలం, నియమ నిష్ఠలతో బ్రాహ్మణులు నిర్వహిస్తున్న పూజల ఫలితాల వలన ప్రతి బ్రహ్మోత్సవం ప్రారంభోత్సవం రోజున, అలాగే చివరి రోజు ఆయన చక్రస్నానం రోజున గరుడ పక్షి వచ్చి స్వామివారి ఆలయం చుట్టూ మూడు ప్రదక్షిణలు చేసి వెళ్లడం అనేది





ఎంతో అద్భుత విషయమని అన్నారు. అలాగే చక్రస్నానం రోజున కూడా నదికి స్వామివారిని తీసుకు వెళ్లినప్పుడు విగ్రహం తేలికగా ఉండి, చక్రస్నానం అయిన తర్వాత తిరిగి తీసుకు వచ్చేటప్పుడు విగ్రహం ఎంతో బరువు పెరుగుతుందని టీజీ వెంకటేష్ తెలిపారు. ఎంతో మహిమ ఉంటేనే ఇలా జరుగుతుందని ఆయన అన్నారు. పది రోజులపాటు ఎంతో సంప్రదాయబద్ధంగా జరిగే బ్రహ్మోత్సవాల్లో కర్నూల్ నగర ప్రజలే కాకుండా, చుట్టుపక్కల వారు కూడా పాల్గొని స్వామివారి కృపను పొందాలని ఆయన కోరారు. ప్రతి ఏడాది బ్రహ్మోత్సవాల లాగానే, ఈ ఏడాది కూడా బ్రహ్మోత్సవాల సందర్భంగా గరుడ పక్షి వచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేయడం జరిగింది. వీడియో విజువల్స్ లో ఆ దృశ్యం కనబడుతుంది. మిత్రులు గమనించగలరు.ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త బీవీ రెడ్డి, బ్రాహ్మణ సంఘం నాయకులు దుర్గాప్రసాద్, శ్రీధర్, సుబ్రహ్మణ్యం, ఆర్యవైశ్య నాయకులు ఇల్లూరు లక్ష్మయ్య, కార్పొరేటర్ పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మహా కుంభాభిషేకం సందర్భంగా వైదిక కమిటీ పరిశీలన..



విభారే న్యూస్ కౌతాళం జనవరి 30..శ్రీ నరసింహ ఈరన్న స్వామి దేవస్థానం ఉరుకుంద..మహా కుంభాభిషేకం సందర్భంగా దేవస్థానం వైదిక కమిటీ వారు, అర్చక సిబ్బంది, పరిపాలన సిబ్బంది వారి ఆధ్వర్యంలో కుంభాభిషేకం పనులు పరిశీలించియున్నారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190